క్లుప్తంగా

బీమాను వినియోగించుకోండి

విజయపురం : పంటల బీమా పథకాన్ని మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాల ని ఏవో రజినికుమారి కోరారు. మండల కేంద్రంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంటకు వాతావరణ ఆధారిత బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ నెల 15వ తేదీలోపు ఎకరాకు రూ.1,750 ప్రీమియం చెల్లించి తమ పంటకు బీమా చేయించుకోవాలన్నారు. తమ వద్ద ఉన్న బ్యాంకు, కామన్ సర్వీస్ సెంటర్ లేదా రైతులు నేరుగా పీఎంఎఫ్‌బీవై వెబ్‌సైట్ ద్వారా బీమా చేయించుకోవచ్చని చెప్పారు. అనంతరం ప్రస్తుత సీజన్‌లో మామిడిలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

నింద్ర: వరి, వేరుశనగ పంటలను ఆశించే చీడపీడలను నివారణకు తీసుకోవాల్సిన చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి తులసీరాం తెలిపారు. మండలంలోని అగరం, చవరంబాకం గ్రామాల్లో వేరుశెనగ, వరి పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి, తప్పనిసరిగా పిచికారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులు

నింద్ర: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామాల్లో మురుగునీటి కాలువలు శుభ్రం చేయడం, రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు తొలగించే కార్యక్రమాలు చేపట్టారు. ప్రజలకు తమ ఇంటి వద్ద పరిసరాలు శుభ్రతగా ఉంచుకోవాలని అధికారులు ఆదేశించారు. మండల కేంద్రంలోని పరిసరాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

నింద్ర: మండలంలో గృహ నిర్మాణ పనులను ఏఈ శ్రీధర్ రాజు బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అన్నారు. పూర్తి చేసిన వారికి బిల్లులు సకాలంలో అందించనున్నట్లు వివరించారు. పనులు పూర్తి చేసి బిల్లు పొందాలని ఆయన సూచించారు. నూతన గృహ నిర్మాణాలు అర్హులైన వారికి నమోదు చేస్తామన్నారు.

పార్టీ నాయకుని మృతికి సంతాపం



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కుమారస్వామి రెడ్డి

నగరి : మండలంలోని ముడిపల్లెకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కె.శ్రీనివాసులు రెడ్డి అనారోగ్యంతో మరణించారు. ముడిపల్లికి బుధవారం ఉదయం చేరుకున్న మాజీ మంత్రి ఆర్కే రోజా సోదరుడు కుమారస్వామి రెడ్డి మృతదేహంపై పూలదండను ఉంచి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ తరపున కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట ఎంపీపీ భార్గవి, మాజీ ఎంపీపీ జయచంద్రారెడ్డి, వైస్‌ఎంపీపీ కన్నియప్ప, నాయకులు గోవిందశెట్టి పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో స్టేషనరీ నిల్

విజయపురం : మండల కార్యాలయంలో మూడు నెలలుగా స్టేషనరీ లేక అవస్థలు పడుతున్నారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చే వారి నుంచి డబ్బులు వసూలు చేసుకుంటున్నారు. దీంతో వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం వచ్చే ప్రజలు కార్యాలయానికి రావటానికి భయపడుతున్నారు. అంతే కాకుండా ఇంటర్‌నెట్ కూడా పని చేయకపోవడంతో సిబ్బంది అవస్థలు పడుతున్నారు.

భక్తిప్రపత్తులతో మహా కుంభాభిషేకం

గంగాధర నెల్లూరు: మండలంలోని కొత్త కోన పంచాయతీ కొల్లావూరులోని శ్రీ కోదండ రామ స్వామి దేవస్థానంలో మహా కుంభాభిషేక వేడుకలు బుధవారం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఆలయంలో మహా యజ్ఞం, మహా క్రతువును వేద పండితులు నిర్వహించారు. భారీ ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారిని సందర్శించుకున్నారు.

వారిని అరెస్ట్ చేయాలి

పుత్తూరు: తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ప్రొఫెసర్ చెంగయ్యపై జరిగిన దాడికి నిరసనగా బుధవారం సాయంత్రం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. దళిత, బహుజన సంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకున్న నిరసనకారులు దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేయాలంటూ నినాదాలు చేశారు.

సారా స్వాధీనం

పాలసముద్రం : నరసింహపురంలో బుధవారం అక్రమంగా సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి సారా స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ చిన్న రెడ్డెప్ప తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు.. తమిళనాడు రాష్ట్రం ఆర్‌కే పేట తాలూకా మాంకాలిపురం గ్రామానికి చెందిన లోకనాధన్ 15 లీటర్ల సారాను అక్రమంగా తీసుకెళ్తున్నట్టు అందిన రహస్య సమాచారంతో ఎస్‌ఐ తన సిబ్బందితో దాడులు చేశారు.

దాసరిగుంట వీధిలో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు



కొత్తవీధిలో...



ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

- పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు
- ఆందోళనలో తల్లిదండ్రులు





నారాయణవనం రోడ్డులో వాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్, దాసరిగుంట వీధిలో కాలిపోయిన మీటర్ బాక్స్

పుత్తూరు: పట్టణంలో పలు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాకరంగా మారాయి. చిన్న పిల్లలకు సైతం అందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. కనీసం వీటి చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. కొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు ఒక పక్కకు ఒరిగిపోయి ఉన్నాయి. గేట్‌పుత్తూరులో పవర్‌లూమ్స్ మీద ఆధారపడి ఎక్కువ శాతం ప్రజలు జీవిస్తున్నారు. దీంతో గేట్‌పుత్తూరులోని దాదాపు ప్రతి వీధిలో ట్రాన్స్‌ఫార్మర్ కనిపిస్తుంది. ఒక్క గేటు పుత్తూరులోనే 20కి పైగా ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకర స్థితిలో దర్శనమిస్తున్నాయి. ఇక్కడ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఎక్కువగా ఉండడంతో నిత్యం విద్యార్థులతో గేట్‌పుత్తూరు ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. అయినా ట్రాన్స్‌కో అధికారులు భద్రతా చర్యలపై ఏమాత్రం దృష్టి సారించడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తగిన భద్రత చర్యలు చేపట్టాలని విద్యుత్‌శాఖ అధికారులకు లిఖిత పూర్వకంగా వినతులు అందజేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం సంభవిస్తే గానీ పట్టించుకోరా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి మంటలు చెలరేగుతున్నాయని, ఎప్పుడు ఎక్కడ పేలిపోతుందోనని హడలిపోతున్నామని వాపోతున్నారు. పిల్లలు ఆడుకొంటూ వెళ్లి వాటిని ముట్టుకొంటే పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ 6వ వార్డుకు చెందిన దాసరిగుంట వీధిలో ఒకే చోట మూడు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. వీటికి అమర్చిన మీటర్ బాక్స్ కాలిపోయి నెలలు గడుస్తున్నా దాని స్థానంలో కొత్త మీటర్‌ను నేటికీ ఏర్పాటు చేయలేదు. కొత్తవీధిలోని ట్రాన్స్‌ఫార్మర్ దుస్థితికి చేరి ప్రమాదకరంగా మారింది. ప్రమాదాలు చోటు చేసుకోక ముందే ట్రాన్స్‌ఫార్మర్ల ఎత్తును పెంచి రక్షణ కంచెను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. పట్టణం మొత్తం మీద ఇలాంటి వాటిని పూర్తిస్థాయిలో మార్పు చేయాలని కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లను చూస్తేనే భయమేస్తోంది



గేట్‌పుత్తూరులోని ట్రాన్స్‌ఫార్మర్లను చూస్తుంటేనే భయమేస్తోంది. స్కూల్స్‌కు వెళ్లి వచ్చే పిల్లలు చాలా మంది ఉన్నారు. ఎప్పుడు ఎక్కడ ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనగా ఉంది. అధికారులు వెంటనే అన్ని ట్రాన్స్‌ఫార్మర్ల ఎత్తును పెంచి, చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలి. చేతులు కాలాక ఆకులు పట్టుకొని ప్రయోజనం ఏముంది? – ఎస్.సెల్వి, దాసరిగుంట వీధి, పుత్తూరు.

ప్రమాదం జరిగితే బాధ్యులెవరు?



నిత్యం బడి పిల్లలు తిరుగుతుండే వీధుల్లోనూ తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. ఆ దిశగా ట్రాన్స్‌కో అధికారులు ఏ మాత్రం పనిచేయడం లేదు. ప్రజాప్రతినిధులైనా తగిన శ్రద్ధ వహిస్తే ప్రజలకు మంచి చేసినవారవుతారు. – జి.కె.సెల్వరాజ్, గేట్ పుత్తూరు

ట్రాన్స్‌ఫార్మర్ల బీమ్స్ ఎత్తు పెంచుతాం

కొన్ని చోట్ల సిమెంట్ రోడ్లువేయడంతో ట్రాన్స్‌ఫార్మర్ల ఎత్తు తగ్గిపోయింది. ఇలాంటి వాటిపై స్టాఫ్ మీటింగ్ నిర్వహించి ఎక్కడెక్కడ లోలెవల్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయో గుర్తిస్తాం. గ్రూప్ ఎస్టిమేట్స్ వేసి నివేదికను డీఈఈకి అందజేస్తాము. మంజూరైన తర్వాత తగిన రక్షణ కవచాలను ఏర్పాటు చేస్తాము. – సాయి, ట్రాన్స్‌కో ఏఈ, పుత్తూరు

అందరికీ ఉపాధి కల్పిస్తాం

విజయపురం : ఉపాధి హామీ ద్వారా పనులు కావల్సిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పిస్తామని ఏఈవో బబిత బుధవారం ఓ ప్రటనలో తెలిపా రు. ఆమె మాట్లాడుతూ మండలంలో మొత్తం 25 పంచాయతీలకు గాను 20 పంచాయతీల్లో పనులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం వర్షాల కారణంగా చెరువు, గుంటల్లో నీళ్లు ఉన్నాయని ఆమె గుర్తు చేశారు. ఉపాధి హామీ ద్వారా పని కావల్సిన వారు క్షేత్రస్థాయి ఇబ్బందికి తెలియజేయాలని సూచించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

గంగాధర నెల్లూరు: రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యక్తి కుటుంబానికి చిత్తూరుకు చెందిన అఖిల భారత యాదవ మహాసభ సంఘం సభ్యులు 1,50,500 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని మోత రంగనపల్లెకు చెందిన గజేంద్ర మండడి ఈనెల 1వ తేదీ రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఈ నేపథ్యంలో అఖిల భారత యాదవ మహాసభ సంఘం సభ్యులు బుధవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. గజేంద్ర మండడికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. వారి భవిష్యత్తు కోసం జాతీయ యాదవ సంఘం అధ్యక్షుడు అన్నా రామచంద్ర యాదవ్ ఆదేశాల మేరకు 1,50, 500 రూపాయలను ఫిక్స్‌డ్ డిపాజిట్ వేశారు. ఆ పత్రాలను కుటుంబ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కవిత యాదవ్, ప్రధాన కార్యదర్శి నవీన్ యాదవ్, స్థానిక సర్పంచ్ సుబ్రహ్మణ్యం యాదవ్, యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, హరీష్ యాదవ్, జ్యోతి యాదవ్, కృష్ణమూర్తి యాదవ్ పాల్గొన్నారు.

నివాళి



సంజీవ రెడ్డికి నివాళులర్పిస్తున్న కృపాలక్ష్మి

శ్రీరంగరాజపురం: మండలంలోని మూలూరుకు చెందిన వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంజీవరెడ్డి (90) అనారోగ్యంతో మరణించారు. ఇది తెలుసుకున్న ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కృపాలక్ష్మి ఆ గ్రామానికి వెళ్లి సంజీవరెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు అనంతరెడ్డి, మాజీ జెడ్పీటీసీ శిరీష, ఎంపీపీ సరిత, మండల నాయకులు రవి, స్థానిక నాయకులు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికే సదస్సులు



సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ శేషగిరి రావు



పాలసముద్రం: రైతుల నుంచి వినతులు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

నింద్ర: మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసమే సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ శేషగిరి రావు అన్నారు. మండలంలోని ఇరుగువాయిలో నిర్వహించిన బుధవారం రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. గ్రామంలోని పలువురు రెవెన్యూ సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకావేరిరాజుపరంలో..

పాలసముద్రం : భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అరుణ కుమారి అన్నారు.. బుధవారం శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయ ఆవరణలో సర్పంచ్ గాలి మహేష్ బాబు, వీఆర్‌ఓ తంగరాజ్ ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ, రైతులు రెవెన్యూ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వివిధ సమస్యలపై రైతులు వినతి పత్రాలను అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో సర్వేయర్ గణేష్, ఎంఆర్‌ఐ దేవి, వీఆర్‌ఓలు శ్రీనివాసులు, రమేష్, గ్రామ సేవకుడు మునస్వామి, కుమారి, రైతులు పాల్గొన్నారు.

బాలికల వికాసానికే శిక్షణ



కరాటే శిక్షణ ఇస్తున్న కరాటే మాస్టర్

పెనుమూరు (కార్వేటినగరం): బాలికల వికాసం కోసమే కిశోర వికాసం ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం కిశోరి వికాశంపై మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, టీచర్, లెక్చరర్లను ఒక విలేజ్ రిసోర్స్ గ్రూపుగా ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. కిశోర బాలికలు కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా అందించే పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. ఈఓపీఆర్డీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ, బాల్యవివాహాలను నిరోధించడానికి అందరూ దృష్టి సారించాలన్నారు. ఎంఈఓ రాజేంద్రన్, డాక్టర్ హర్షవర్ధన్ రెడ్డి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో కరాటేమాస్టర్ పరంధామయ్య ఆధ్వర్యంలో పెనుమూరులోని శ్రీవిద్య ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థినులు హర్షిత, గౌతమి, కిరణ్మయి, నిషిత చేసిన కరాటే విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కరాటేమాస్టర్ మాట్లాడుతూ, ప్రస్తుతం సమాజంలో ఆడవారిపై దాడులు, అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని, వీటిని ఎదుర్కోవాలన్నా, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలన్నా ప్రతి ఒక్క అమ్మాయి కరాటే నేర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం చిరంజీవి, పీహెచ్‌ఎన్ ధనలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ రేణుక, టీచర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి

దారి ఏర్పాటు చేయండి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న దంపతులు

పుత్తూరు: పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో దారికి అడ్డంగా కొందరు ఏర్పాటు చేసిన ఇనుప మెట్లను తొలగించి దారి ఏర్పాటు చేయాలని అదే వీధికి చెందిన షేక్ షకీల, షేక్ ఖాదర్ మోహీద్దీన్ దంపతులు బుధవారం మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ శ్రీరామ్‌నగర్‌లోని తమ ఇంటికి వెళ్లాలంటే మున్సిపాలిటీకి చెందిన కేవలం 3 అడుగుల దారి మాత్రం ఉందని తెలిపారు. అందులో దొరస్వామి అనే వ్యక్తి తన ఇంటికి ఆనుకుని వున్న 2.5 అడుగుల స్థలాన్ని ఆక్రమించి ఇనుప మెట్లను ఏర్పాటు చేసినట్లు ఆరోపించారు. దీనిని ప్రశ్నిస్తే తమపై దాడికి దిగుతున్నాడని ఆరోపించారు. మున్సిపాలిటీకి చెందిన దారిని ఆక్రమించి ఏర్పాటు చేసిన ఇనుప మెట్లను తొలగించి న్యాయం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

పాలసముద్రం: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్య సూత్రాలను పాటించాలని ఎంపీడీఓ క్రిష్ణ మహేష్‌రెడ్డి కోరారు. బుధవారం వెంగళరాజుకుప్పం సర్పంచ్ లిల్లీ, మండల విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శి సుధ ఆధ్వర్యంలో పరిసరాల శుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా కురుస్తున్న వర్షాలకు ఇంటి పరిసరాలలో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. కాచి చల్చార్చిన నీరు తీసుకుంటే మంచిదన్నారు. పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు పారిశుధ్యం మెరుగు పరచాలన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులు వీధుల్లో పిచ్చి మొక్కలను తొలగించారు.

మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలి



ఐటీఐ కళాశాలలో సూచనలిస్తున్న ఎంఈవో

విజయపురం : ఇంటర్వ్యూలకు ముందు మానసిక ఒత్తిడికి గురికాకుండా సిద్ధంగా ఉండాలని నింద్ర ఎంఈవో శ్రీధర్‌రాజు అన్నారు. మాధవరం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో బుధవారం విద్యార్థులు ఇంటర్వ్యూ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్వ్యూకు వెళ్లే ముందు రోజు ఏదైనా శారీరక శ్రమతో కూడిన కార్యాచరణ చేయాలన్నారు. ధ్యానం చేసి మంచిగా విశ్రాంతినిచ్చే సంగీతాన్ని వినాలన్నారు. అద్దం ముందు వారి ప్రతిస్పందనలను సాధన చేయాలని సూచించారు. ఇంటర్వ్యూల సమయంలో ధరించే వస్త్రధారణ సౌకర్యవంతంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ లలిత పాల్గొన్నారు.

గర్భిణులకు నిస్వార్థ సేవ



ఆస్పత్రిలో పౌష్టికాహారం అందుకున్న గర్భిణులు

నగరి : ప్రభుత్వ ఆస్పత్రికి విచ్చేసే గర్భిణులకు ప్రతి బుధవారం మాజీ మంత్రి ఆర్కేరోజా తన చారిటబుల్ ట్రస్టు ద్వారా అందిస్తున్న నిస్వార్థ సేవ నిరంతరాయంగా కొనసాగుతోంది. ఆరేళ్లపాటుగా ఈ సేవలు కొనసాగిస్తూ గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తూనే ఉన్నారు. అధికారం ఉన్నా లేకున్నా తన సహృదయంతో ఆమె కొనసాగిస్తూనే ఉన్నారు. గర్భిణులకు అన్నదానం అన్నది తాను రాజకీయ లబ్ధికోసం చేసేది కాదని ఆమె నిరూపిస్తున్నారు. ఆమె చేస్తున్న ఈ సేవ ఆమె మంచి మనసుకు అద్దం పడుతోందని నగరి, పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పౌష్టికాహారం అందుకునే గర్భవతులు తెలుపుతున్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ



ఎస్‌కేఆర్ పురంలో ఎన్నికల నోటిఫికేషన్ అతికిస్తున్న అధికారులు

పాలసముద్రం : మండల పరిధిలోని సాగునీటి సంఘాల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని ఇరిగేషన్ డీఈ విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన నోటిఫికేషన్ జారీ చేశారు. మండల పరిధిలోని తొమ్మిది చెరువులకు సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించే ప్రదేశంలో ఎన్నికల అధికారులు నోటిఫికేషన్ అతికించారు. అయితే వీటిని ఏకగ్రీవం చేసేందుకు అధికార పార్టీ నేతలు పావులు కదుపుతున్నారు. రైతుల భాగస్వామ్యంతో నడపాల్సిన సంఘాలకు రాజకీయ రంగు పులమేపనిలో తమ్ముళ్లు తలమునకలయ్యారు.

ప్రభుత్వాస్పత్రిలోనే సుఖ ప్రసవం



గర్భిణికి రక్త పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

పాలసముద్రం : మండలంలోని గర్భిణులు ప్రతి నెలా క్రమం తప్పకుండా రక్త, వైద్య పరీక్షలు చేయించుకోవాలని నెల నెల క్రమం తప్పకుండా రక్తపరీక్షలు చేసుకున్న తరువాతనే వైద్య పరీక్షలు చేసుకోవాలని వైద్యాధికారి ప్రవీణ్ కోరారు. బుధవారం స్థానిక ఆరోగ్య ఉపకేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్‌తోపాటు సూపర్‌వైజర్ సుశీల మాట్లాడారు. ఆశావర్కర్లు గర్భిణులకు ప్రసవం అయ్యేవరకు వారికి సహాయంగా ఉండాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం రాధ, గంగాగౌరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నారాయణస్వామి, కృపాలక్ష్మి, నాయకులు

గంగాధర నెల్లూరు/పుత్తూరు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలుకుని అన్నదాతలను నిలువునా మోసం చేస్తోందని, దీనికి నిరసనగా పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఈ నెల 13న కలెక్టరేట్ వద్ద ఆందోళన చేయనున్నట్టు మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కృపాలక్ష్మి తెలిపారు. బుధవారం దీనికి సంబంధించి అన్నదాతకు అండగా...పోస్టర్లను గంగాధరనెల్లూరు, పుత్తూరులో ఆవిష్కరించి వారు మాట్లాడారు. తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివిధాలా ఆదుకున్నారని, రైతు భరోసా, రుణాలు, పంట బీమా అందించారని, కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక తొలి నుంచీ రైతులను నిర్లక్ష్యం చేస్తూ దగా చేస్తోందని విమర్శించారు. కూటమి అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేసి కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.